RNI NO.TELTEL/2022/83842

# ప్రభాత గమనం

PRABHATA GAMANAM

తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 261 | సంపుటి 4 | మంగళవారం | 16-06-2026 | పేజీలు 3 | వెల 3/-

"ఇతర నగరాలకు మెట్రో వచ్చినపుడు.. హైదరాబాద్‌కు ఎందుకు రాదు?" అహ్మదాబాద్, విశాఖపట్నం వంటి నగరాలకు కేంద్ర ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టులను మంజూరు చేస్తుండగా, హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఎందుకు అనుమతి రాలేదో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్రాన్ని నిలదీయలేక తమపై నిందలు వేయడం సరైంది కాదని అన్నారు.



2

# రేవంత్ వైఫల్యమే!

## మెట్రో ఫేజ్-2 అటకెక్కడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే

- మెట్రో ఫేజ్-2కు కేంద్ర అనుమతి రాకపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు
- ఇతర నగరాలకు మెట్రో మంజూరు.. హైదరాబాద్‌కు ఎందుకు లేదని ప్రశ్న
- కేసీఆర్ హయాంలో మెట్రో వేగంగా పూర్తయిందన్న కేటీఆర్
- మెట్రో భవిష్యత్తును పణంగా పెడుతున్నారని సీఎంపై విమర్శలు

హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 ప్రాజెక్టు చుట్టూ రాజకీయ వేడి మరింత పెరిగింది. మెట్రో రెండో దశకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటికీ అనుమతులు రాకపోవడాన్ని ప్రధాన అంశంగా తీసుకుని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించిన ఆయన, తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే సీఎం అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. అహ్మదాబాద్, విశాఖపట్నం వంటి నగరాలకు కేంద్రం మెట్రో ప్రాజెక్టులను మంజూరు చేస్తుంటే, దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ కు మెట్రో ఫేజ్-2 ఎందుకు సాధించలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రాన్ని నిలదీయలేక బీఆర్ఎస్ పై నిందలు మోపడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. మెట్రో విస్తరణ, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, అభివృద్ధి ప్రాజెక్టుల సాధన అంశాలపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి.

— ప్రభాత గమనం, హైదరాబాద్



# ప్రతి పోలీస్ స్టేషన్‌కు 'పోలీస్ మెంటార్'

- హైదరాబాద్ సిటీ సీపీ సజ్జనార్

హైదరాబాద్ జూన్ 15(ప్రభాత గమనం):

హైదరాబాద్‌లో ప్రజా భద్రత, మహిళా రక్షణను బలోపేతం చేసేందుకు, పౌరుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు సరికొత్త సంస్కరణలు చేపడుతున్నట్లు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కానిస్టేబుల్‌ను 'పోలీస్ మెంటార్'గా నియమించనున్నట్లు ప్రకటించారు. మహిళలు తమ సమస్యలను భయం లేకుండా వెల్లడించేందుకు "స్పందన – ఆల్ ఉమెన్ ఫస్ట్ రెస్పాండర్ సిస్టమ్"ను అందుబాటులోకి తెచ్చినట్లు సీపీ తెలిపారు.


# వారం పాటు భారీ వర్షా లు..

- తెలంగాణకు గుడ్ న్యూస్ చెప్పిన వాతావరణ శాఖ
- బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో వర్షాల సూచన
- ఉత్తర తెలంగాణలో మరో రెండు రోజులు వడగాల్పులు
- ఈ నెల 18 నుంచి 24 వరకు విస్తారంగా వర్షాలు
- ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో భారీవర్షాలకు అవకాశం
- ముందస్తు చర్యలకు అధికార యంత్రాంగానికి మంత్రి ఆదేశాలు
- సాధారణంతో పోలిస్తే 10 శాతం తక్కువ వర్షపాతం నమోదు

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. ఈ నెల 18 నుంచి 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షా లు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో భారీవర్షా లు నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం బంగాళాఖాతంలో ద్రోణి, అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండటంతో రాష్ట్రంలో వర్షా లు విస్తరించే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు మందకొడిగా ముందుకు సాగుతున్నప్పటికీ, మరో నాలుగు నుంచి ఐదు రోజుల్లో రాష్ట్రమంతా విస్తరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



2



# విద్యార్థికి కరెంట్ షాక్..

- కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్ లో ఘటన
- పాఠశాలలో తోరణాలు కడుతుండగా తగిలిన విద్యుత్ వైర్లు
- హుటాహుటీన ఆస్పత్రికి తరలింపు

నల్గొండ, జూన్15(ప్రభాత గమనం):

పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఓ విద్యార్థికి కరెంట్ షాక్ తగిలిన ఘటన కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, పాఠశాల గేటుకు తోరణాలు కట్టే పనిలో ఓ ఉపాధ్యాయుడు సహాయం కోరగా, గ్రౌండ్‌లో ఆడుకుంటున్న రామచరణ్ అనే ప్రైవేట్ పాఠశాల విద్యార్థి తోరణాలు కట్టేందుకు ముందుకు వచ్చాడు. ఈ క్రమంలో తోరణాలు కడుతుండగా సమీపంలోని విద్యుత్ వైర్లు తగలడంతో విద్యార్థికి తీవ్రంగా కరెంట్ షాక్ తగిలింది. గాయాల పాలైన విద్యార్థి స్పృహ తప్పి కిందపడిపోవడంతో వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు.ఘటనపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, పాఠశాలల్లో భద్రతా ప్రమాణాల విషయంలో నిర్లక్ష్యం వద్దని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# బడి బాగుకు సర్పంచ్ భరోసా

- పెద్దకిష్టాపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు కార్పొరేట్ లుక్!
- విద్యార్థుల కోసం రూ. 30 వేల విలువైన ఫ్యాన్ల వితరణ
- పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాలు, వీధి దీపాల ఏర్పాటు
- మధ్యాహ్న భోజనానికి అదనపు బడ్జెట్ :సర్పంచ్ రామ్ సింగ్ నాయక్

3



# విద్యార్థులకు సీఎం శుభాకాంక్షలు

- పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి సందేశం
- కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలి
- విద్యార్థుల విజయమే తెలంగాణ అభివృద్ధికి పునాది : సీఎం రేవంత్ రెడ్డి

2





## కిషన్‌రెడ్డి వల్లే ఫేజ్ 2కు ఇబ్బందులు

### తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు ఆలస్యానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డే ప్రధాన కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఇతర రాష్ట్రాల మెట్రోలకు అనుమతులు ఇచ్చిన కేంద్రం తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆరోపిస్తూ, కిషన్ రెడ్డి, కేసీఆర్ , కేటీఆర్ కలిసి ప్రాజెక్టును అడ్డుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు.మెట్రో అనుమతుల కోసం కిషన్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేద్దామా? అని అడిగారు. కిషన్ రెడ్డి వెనుక ఎవరున్నారో తాను నేరుగా చెప్పట్లేదని అన్నారు. కిషన్ రెడ్డి కేబినెట్ మంత్రి కాబట్టి ఆయనకే ఎక్కువ బాధ్యత ఉందని హితువు పలికారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి కేసీఆర్ సహకరించినందుకు కిషన్ రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారని విమర్శించారు.

# రేవంత్ వైఫల్యమే!

- మెట్రో ఫేజ్-2కు కేంద్ర అనుమతి రాకపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు
- ఇతర నగరాలకు మెట్రో మంజూరు.. హైదరాబాద్ కు ఎందుకు లేదని ప్రశ్న
- కేసీఆర్ హయాంలో మెట్రో వేగంగా పూర్తయిందన్న కేటీఆర్
- ఫేజ్-2 అటకెక్కడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపణ
- మెట్రో భవిష్యత్తును ఫణంగా పెడుతున్నారని సీఎంపై విమర్శలు

**ప్రభాత గమనం, హైదరాబాద్ :**

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ (ఫేజ్-2) ప్రాజెక్టుపై రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది. మెట్రో ఫేజ్-2కు కేంద్రం నుంచి అనుమతులు సాధించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. మెట్రో రెండో దశ సాధనలో అట్టర్ ఫ్లాప్ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**"ఇతర నగరాలకు మెట్రో.. హైదరాబాద్‌కు ఎందుకు కాదు?"**

అహ్మదాబాద్, విశాఖపట్నం వంటి నగరాలకు కేంద్ర ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టులను మంజూరు చేస్తుండగా, హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఎందుకు అనుమతి రాలేదో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్రాన్ని నిలదీయలేక తమపై నిందలు వేయడం సరైంది కాదని అన్నారు.

**"71 సార్లు ఢిల్లీ వెళ్లినా ఫలితం శూన్యం"**

ప్రధానిని కలవడానికి పలుమార్లు ఢిల్లీ వెళ్లినప్పటికీ రాష్ట్రానికి అవసరమైన ప్రాజెక్టులను సాధించలేకపోవడం రేవంత్ రెడ్డి పాలన వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంపై ప్రశ్నించే ధైర్యం లేక బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు.

**కేసీఆర్ హయాంలో మెట్రో వేగం.. కాంగ్రెస్ హయాంలో బ్రేక్?**

2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం మెట్రో నిర్మాణాన్ని వేగవంతం చేసి మూడు సంవత్సరాల్లో పూర్తి చేసిందని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుతం లక్షలాది మంది ప్రయాణికులకు మెట్రో సేవలు అందుతున్నాయంటే అది బీఆర్ఎస్ ప్రభుత్వ సమర్థతేనని పేర్కొన్నారు.

**"ప్రజల అవసరాలకు అనుగుణంగానే ఫేజ్-2 రూపకల్పన"**

మెట్రో రెండో దశను ఆరు కారిడార్లు, 72 స్టేషన్లు, 76 కిలోమీటర్ల మేర విస్తరించేలా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని కేటీఆర్ తెలిపారు. నగరంలోని రద్దీ ప్రాంతాలను అనుసంధానించేలా రూపొందించిన మార్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.

**ఎల్ అండ్ టీ వ్యవహారంపై ఆరోపణలు**

మెట్రో రెండో దశపై ఎల్ అండ్ టీ సంస్థ ముందుకు రాలేదని ప్రభుత్వం చెబుతున్న వాదనలను కేటీఆర్ తప్పుబట్టారు. మెట్రో ఆస్తులు, భూములపై కన్నేసి సంస్థను పక్కకు నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఆరోపించారు. మెట్రో ఫేజ్-2 సాధనలో విఫలమైనందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.




## విద్యార్థులకు సీఎం శుభాకాంక్షలు

- పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా సీఎం సందేశం
- కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచన
- విద్యార్థుల విజయమే తెలంగాణ అభివృద్ధికి పునాది: సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 15 (ప్రభాత గమనం):**

వేసవి సెలవులు ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. మంచి విలువలు అలవర్చుకుని నిరంతరం శ్రమిస్తూ తమలోని ప్రతిభను వెలికితీయాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్రం, దేశానికి గర్వకారణంగా నిలిచే పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. కొత్త విద్యా సంవత్సరాన్ని ఉత్సాహంగా ప్రారంభించి విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయమే తెలంగాణ అభివృద్ధికి బాటలు వేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.




## రేషన్ షాపుల ద్వారా 14 రకాల సరుకులను పంపిణీ చేయాలి

- మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా
- కలెక్టర్ స్నేహ శబరీష్ కు వినతిపత్రం సమర్పణ
- మహిళలకు నెలకు రూ.2500 హామీని వెంటనే అమలు చేయాలి: రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మాచర్ల భారతి

**మహబూబాబాద్, జూన్ 15 (ప్రభాత గమనం) :**

పేద కుటుంబాలను ఆదుకునేందుకు రేషన్ షాపుల ద్వారా ప్రతి నెలా ఇచ్చే బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర వంట సరుకులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఉచితంగా పంపిణీ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. సోమవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మాచర్ల భారతి మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో ఉపాధి అవకాశాలు లేక, పనులు దొరకక ఎన్నో పేద కుటుంబాలు పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి 14 రకాల సరుకులను ఉచితంగా అందించి ఆదుకోవాలన్నారు. దేశంలో, రాష్ట్రంలో మహిళల భద్రత నానాటికీ క్షీణిస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, లైంగిక వేధింపులు విపరీతంగా పెరిగిపోయాయని, పని ప్రదేశాల్లో సైతం రక్షణ లేకపోవడంతో మహిళలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించి గట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను మాచర్ల భారతి ఈ సందర్భంగా గుర్తు చేశారు. "ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళలకు నెలకు 2500 రూపాయల జీవన భృతి ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించింది. కానీ అధికారంలోకి వచ్చాక ఆచరణలో ఆ హామీ ఎక్కడా కనిపించడం లేదు. మహిళలకు ఇచ్చిన ఈ హామీని తక్షణమే అమలు చేయాలి."ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి రేషన్ సరుకుల ఉచిత పంపిణీ చేపట్టాలని, మహిళా భృతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐద్వా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళలను ఏకం చేసి ఆందోళనలు, పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత, మహబూబాబాద్ టౌన్ కార్యదర్శి చాగంటి భాగ్యమ్మ, పంజాల ఉపేంద్ర, లింగంపల్లి సుగుణ పాల్గొన్నారు. అలాగే గార్ల మండల అధ్యక్ష కార్యదర్శులు మల్లెల నాగమణి, చింతా మౌనిక, మరిపెడ బంగ్లా అధ్యక్ష కార్యదర్శులు దొంతు మమత, పుల్లూరు పద్మ, పోలెపొంగు ప్రవళిక, బయ్యారం మండల కార్యదర్శి కాదరి విజయ, తొర్రూర్ మండల కార్యదర్శి బొల్లం మమత, తొర్రూర్ మండల కమిటీ సభ్యులు శ్రీరంగం రాధా, ఎండి షమీన, దస్తరి భాగ్య, లక్ష్మి సౌజన్య, మంజుల, డోర్నకల్ మండల కమిటీ సభ్యురాలు ప్రమీల తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వారం పాటు భారీ వర్షాలు..

- తెలంగాణకు గుడ్ న్యూస్ చెప్పిన వాతావరణ శాఖ
- బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో వర్షాల సూచన
- ఉత్తర తెలంగాణలో మరో రెండు రోజులు వడగాల్పులు
- ఈ నెల 18 నుంచి 24 వరకు విస్తారంగా వర్షాలు
- ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో భారీవర్షాలకు అవకాశం
- ముందస్తు చర్యలకు అధికార యంత్రాంగానికి మంత్రి ఆదేశాలు
- సాధారణంతో పోలిస్తే 10 శాతం తక్కువ వర్షపాతం నమోదు



**హైదరాబాద్, జూన్ 15 (ప్రభాత గమనం):**

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. ఈ నెల 18 నుంచి 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం బంగాళాఖాతంలో ద్రోణి, అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండటంతో రాష్ట్రంలో వర్షాలు విస్తరించే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు మందకొడిగా ముందుకు సాగుతున్నప్పటికీ, మరో నాలుగు నుంచి ఐదు రోజుల్లో రాష్ట్రమంతా విస్తరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఉత్తర భారతదేశం నుంచి వేడిగాలుల ప్రభావం కొనసాగుతుండటంతో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ జిల్లాల్లో మరో రెండు రోజుల పాటు వడగాల్పులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అయితే దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో క్యాములోనింబస్ మేఘాల ప్రభావంతో ఇప్పటికే అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయని వెల్లడించింది. హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ, జూన్ 8న జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం హైదరాబాద్, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వరకు విస్తరించాయని తెలిపారు. ఉత్తర తెలంగాణలో వేడిగాలులల ప్రభావం మరో రెండు రోజుల పాటు కొనసాగినా, 18వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పెరిగే అవకాశముందని చెప్పారు. ఇక రాష్ట్రంలో జూన్ 1 నుంచి 14 వరకు 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, సాధారణ వర్షపాతం 54.9 మిల్లీమీటర్లతో పోలిస్తే సుమారు 10 శాతం లోటు ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అన్ని శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

## ఘనంగా డిప్యూటీ సీఎం భట్టి జన్మదిన వేడుకలు

**బయ్యారం, జూన్ 15 (ప్రభాత గమనం) :**



తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో బయ్యారం సింగిల్ విండో చైర్మన్ మూల మధుకర్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిస్తున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెరుకుపల్లి నరసయ్య, వజ్జ సమత - గణేష్, తగిరే నిర్మల రెడ్డి, బయ్యారం 2వ వార్డు ప్రతినిధి ఎస్.కే. జానీ, ఎస్.కే. బాషా, పోతుగంటి సుమన్, తిరుమల చంద్రారెడ్డి, ఎస్.కే. కమల్, గంద్రాది భాస్కర్ రెడ్డి, రావుల శ్రీనివాస్ పాల్గొన్నారు.అలాగే యువజన విభాగం నుండి ఇల్లెందు యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ మబ్బు ప్రశాంత్, పోతురాజ్ అలెక్స్, నిమ్మల అఖిల్ యాదవ్, దేవరబోయిన మహేష్ యాదవ్, కొత్త వినయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శక్తి భవనాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే డా.భూక్యా మురళి నాయక్
- మహమూద్‌పట్నం గ్రామంలో రూ.10 లక్షలతో భవన నిర్మాణానికి భూమిపూజ
- మహిళల సమావేశాలు, శిక్షణలకు వేదికగా మహిళా శక్తి భవనం
- మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ఎమ్మెల్యే
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు

**కేసముద్రం, జూన్ 15 (ప్రభాత గమనం):**

కేసముద్రం మండలంలోని మహమూద్ పట్నం గ్రామంలో మహిళా శక్తి భవనాన్ని మహబూబాబాద్ శాసనసభ్యులు భూక్య మురళి నాయక్,ప్రారంభించారు. భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహమూద్ పట్నం గ్రామంలో మహిళా శక్తి కార్యాలయం ను స్వయం సహాయక సంఘాల మహిళలు సమావేశాలు ఏర్పాటు చేసుకొని శిక్షణ కార్యక్రమాల ద్వారా మహిళా శక్తి భవనాలను ఉపయోగించుకోవాలని వారు తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి భవనానికి 10 లక్షల రూపాయలు మంజూరు చేసిందని వారు తెలిపారు. అంతేకాకుండా మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తుందని సెర్ప్ మహిళా శక్తి భవనాలు మంజూరు చేసి వారి యొక్క సమస్యలు పరిష్కరించుకోవడంలో కార్యాలయాలు సద్వినియోగపరచుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్, బండారు వెంకన్న, ఎంపీడీవో క్రాంతి, ఎంపీ ఓ హరీష్, ఎస్సై క్రాంతి కిరణ్, మహమూద్ పట్నం గ్రామ సర్పంచ్ కట్ల ఎల్లయ్య, ఉపసర్పంచ్ ఏశబోయిన అమృత శ్రీనివాస్, వార్డు మెంబర్లు పెనుమాండ్ల సోమయ్య, దాసరి లచ్చమ్మ, వివో చింతమళ్ళ సంధ్య, వివో భూక్య నెహ్రూ,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మిట్టగడుపుల యాకూబ్, బద్దుల వెంకటమల్లు, చిలువేరు లింగయ్య,బద్దుల తిరుపతి, మాజీ ఎంపీటీసీ ముంజాల శ్రీనివాస్, మాజీ వార్డ్ మెంబర్లు ఎలిజాల యాకయ్య ,కాసోజు యాకాంతచారి, గుండెపురి వెంకన్న , పోలు నరసయ్య, పిట్టల ఉపేందర్, భోగ శంకర్, ముంజాల యాకన్న, సిలివేరి గణేష్, సిలివేలు శివాజీ, దేశ బోయిన అనిల్, ఏశబోయిన సంపత్, మందుల అమర్నాథ్, మందుల ముత్తయ్య, భూక్యారం తండా సర్పంచ్ జాటోత్ సోమీ, తర్య తండా సర్పంచ్ బుజ్జి శంకర్ నాయక్ మాజీ సర్పంచ్ సిలివేరు భీమయ్య, కాసోజు వెంకటాచారి, కాంబోజు యాకయ్య, పులుగుజ్జా నారాయణ, చంద వెంకన్న మహిళా మణులు కాసోజు రమ మాదారపు పూలమ్మ, గుండ్ల సుశీల, ఎలిజాల భాగ్యమ్మ, కట్ల లచ్చమ్మ, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# టీవీ నటి సంచితా ఉగాలే మృతి..



- సినీ,టీవీ రంగంలో విషాదం..
- మృతికి గల కారణాలపై పోలీసుల దర్యాప్తు

**ముంబై, జూన్ 15(ప్రభాత గమనం):**

ప్రముఖ టీవీ నటి సంచితా ఉగాలే (22) ముంబైలోని నాలాసొపారాలో తన నివాసంలో మృతి చెందిన ఘటన విషాదం నింపింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె అపస్మారక స్థితిలో కనిపించగా కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. 'కుమ్‌కుమ్ భాగ్య' సీరియల్‌తో గుర్తింపు పొందిన సంచితా, 'ఛావా', 'సైలెన్స్-2' చిత్రాల్లో కూడా నటించారు. ఈ ఘటనకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.





# గణిత బోధనలో వినూత్న పద్ధతులు

- ఉపాధ్యాయులకు వేదిక్, అభాకస్ మ్యాథ్స్ పై ప్రత్యేక శిక్షణ...

**కేసముద్రం జూన్ 15(ప్రభాత గమనం):**

కేసముద్రం మండలంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ లో విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంపొందించి, వారి గణన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులకు వేదిక్ మ్యాథ్స్, అభాకస్ మ్యాథ్స్ అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో గణితానికి అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. విద్యార్థులు గణితాన్ని సులభంగా అర్థం చేసుకొని, వేగంగా లెక్కలు చేయగలిగే నైపుణ్యాలను పెంపొందించేందుకు వేదిక్ మ్యాథ్స్, అభాకస్ వంటి ఆధునిక బోధనా విధానాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులను గణితంలో మరింత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలో ఈ వినూత్న పద్ధతులను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు ఆధునిక గణిత బోధనా విధానాలపై అవగాహన పెంచుకొని, విద్యార్థులకు మరింత సమర్థవంతంగా బోధించే అవకాశం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని వేదిక్ మ్యాథ్స్, అభాకస్ పద్ధతులపై శిక్షణ పొందారు. విద్యార్థులలో తార్కిక ఆలోచన, ఏకాగ్రత, వేగవంతమైన గణన సామర్థ్యాల పెంపుదలకు ఈ విధానాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.




# వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- వర్షాకాలం యాక్షన్ ప్లాన్ ప్రకారం క్షేత్రస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేయాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్, జూన్ 15(ప్రభాత గమనం):**

సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా అటవీశాఖ అధికారి విశాల్ బత్తుల, అదనపు కలెక్టర్లు రెవెన్యూ కె.అనిల్ కుమార్, ఇన్చార్జి స్థానిక సంస్థలు, హౌసింగ్ పిడి, పురుషోత్తం, సంబంధిత అధికారులతో కలిసి వన మహోత్సవం కార్యక్రమం నిర్వహణ, రానున్న వర్షాకాలం నేపథ్యంలో క్షేత్రస్థాయిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై యాక్షన్ ప్లాన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనం పరిశుభ్రత తదితర అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి క్షేత్రస్థాయిలో అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 18వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో వన మహోత్సవం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించడం జరుగుతుందని, జిల్లాలో వన మహోత్సవం మొక్కలు నాటే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని అన్ని విభాగాల వారు కచ్చితంగా తమకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, 43.5 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు, జిల్లాలోని నర్సరీలలో డిమాండ్ కనుగుణంగా మొక్కలను పెంచాలని సూచించారు, అటవీ,మున్సిపల్, గ్రామీణ ప్రాంతాలలో మంకీ ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేయాలని అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, నాటిన మొక్కల పెంపకం సంరక్షణలో తగిన జాగ్రత్తలు వహించాలని ఎవెన్యూ ప్లాంటేషన్, మంకీ ఫుడ్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వన మహోత్సవం తీసుకోవలసిన చర్యలపై శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా అటవీ అధికారి విశాల్ బత్తుల వివరించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో క్షేత్రస్థాయిలో గ్రామపంచాయతీ, మున్సిపల్ పరిధిలలో అంటూ వ్యాధులు విష జ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు యాక్షన్ ప్రకారం ముందుకు వెళ్లేందుకు అన్ని విభాగాల అధికారులు కృషి చేయాలని అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గత సంవత్సరం ఇదే సీజన్లో విష జ్వరాలు అంటు వ్యాధులు అధికంగా ఉన్న ప్రదేశాలను గుర్తించాలని , జిల్లాను విభాగాల వారీగా వేరుచేసి వైద్య సిబ్బంది డాక్టర్స్, ఏఎన్ఎం, ఆశ సిబ్బందిని కేటాయించాలని ప్రతిరోజు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ ఉండాలని సూచించారు.అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సబ్ సెంటర్స్ లలో మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్ పరిధిలలో సానిటేషన్ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, అంటువ్యాధులు, విష జ్వరాల నివారణ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, అందుకోసం కరపత్రాలు లోకల్ సామాజిక మాధ్యమాలు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తెలియపరచాలన్నారు. ప్రత్యేకించి అన్ని వసతి గృహాలు ,ప్రభుత్వ పాఠశాలలు ఇతర విద్యాసంస్థలలో స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యాసంస్థలలో పనిచేసే సిబ్బంది ,పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన విద్యా సంస్థలలో తనిఖీలు నిర్వహించి సౌకర్యాలు తనిఖీ చేయాలని అట్టి నివేదికను సమర్పించాలన్నారు. అంటువ్యాధులు, విష జ్వరాలపై ఏమైనా అత్యవసర సమాచారముంటే హెల్ప్ లైన్ ( కంట్రోల్ రూమ్) నెంబర్ 9441471624 లో సంప్రదించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అన్ని విభాగాల జిల్లా అధికారులు సంబంధిత సిబ్బంది కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# అందుబాటులో యూరియా..

- రైతులు కంగారు పడొద్దు :ఏవో వెంకన్న
- అన్నదాతలకు యూరియా బ్యాగులు పంపిణీ

**కేసముద్రం, జూన్ 15 (ప్రభాత గమనం):**

మండలంలోని రైతులకు వ్యవసాయ శాఖ కీలక సమాచారం అందించింది. సోమవారం నుంచి మండలంలో యూరియా ఎరువులు అందుబాటులోకి వచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.రైతులు ఎవరూ యూరియా కోసం కంగారు పడాల్సిన అవసరం లేదని, అందరికీ సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని ఆయన స్పష్టం చేశారు. యూరియా కావాల్సిన రైతులు "యూరియా బుకింగ్ యాప్" ద్వారా తమకు కావలసిన కోటాను సులభంగా బుక్ చేసుకోవచ్చని సూచించారు. అనవసరపు ఆందోళనలతో దుకాణాల వద్ద గుమికూడొద్దని కోరారు.ప్రస్తుతం మండల వ్యాప్తంగా విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు అధికారి తెలిపారు. ఈ రోజు నాటికి మండలంలో మొత్తం 4,859 యూరియా బ్యాగులు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు అగ్రోస్ రైతు సేవా కేంద్రాలు గుర్తింపు పొందిన ప్రైవేట్ డీలర్ల వద్ద రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, యాప్ బుకింగ్ ద్వారా పారదర్శకంగా ఎరువులను పొందాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.

# తుంగతుర్తిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

- హాజరైన పార్టీ ముఖ్య నేతలు
- డిజిటల్ సభ్యత్వం, ఓటరు జాబితాపై దిశానిర్దేశం

**తుంగతుర్తి, జూన్ 15(ప్రభాత గమనం):**

తుంగతుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్ కుమార్ పాల్గొని పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు, ప్రత్యేక ఓటరు జాబితా పరిశీలన (ఎస్ఐఆర్) ప్రక్రియపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఓటర్ల హక్కులను కాపాడే విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ ఇన్‌చార్జీలు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





# ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధం

- నర్సింహుల గూడెంలోని వాచ్యతండాలో ఘటన
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

**కేసముద్రం జూన్ 15(ప్రభాత గమనం):**

కేసముద్రం మండలం నర్సింహుల గూడెంలోని వాచ్యతండాలో ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధం అయ్యాయి. అజ్మీరా బిచ్చునాయక్, అజ్మీరా కిషన్ నాయక్ ల గడ్డి వాము దగ్ధం పూర్తిగా కాలిపోయాయి. పశువుల మేత కోసం పెట్టిన గడ్డివాములు దగ్ధం కావడంతో రైతు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# బడి బాగుకు సర్పంచ్ భరోసా

- పెద్దకిష్టాపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు కార్పొరేట్ లుక్!
- విద్యార్థుల కోసం రూ. 30 వేల విలువైన ఫ్యాన్ల వితరణ
- పాఠశాల ఆవరణలో సిసి కెమెరాలు, వీధి దీపాల ఏర్పాటు
- మధ్యాహ్న భోజనానికి అదనపు బడ్జెట్ ఇస్తానని సర్పంచ్ రామ్ సింగ్ నాయక్ హామీ

**గార్ల, జూన్ 15: (ప్రభాత గమనం) :**

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిస్తూ పెద్దకిష్టాపురం సర్పంచ్ గంగావత్ రామ్ సింగ్ నాయక్ గారు తన ఉదారతను చాటుకున్నారు. సోమవారం పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS)ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసిన సర్పంచ్, పాఠశాల రూపురేఖలను మార్చేలా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.వేసవి తీవ్రత దృష్ట్యా విద్యార్థులు తరగతి గదుల్లో ఇబ్బంది పడకుండా ఉండేందుకు సర్పంచ్ గారు రూ. 30 వేల సొంత ఖర్చుతో 10 కొత్త క్రాంప్టన్ ఫ్యాన్లను బహూకరించారు. అలాగే ఉపాధ్యాయ సిబ్బంది కోసం ప్రత్యేకంగా స్టాండ్ ఫ్యాన్‌ను వితరణగా అందించారు. పాఠశాలలో పాతబడిన విద్యుత్ వైరింగ్‌ను తొలగించి, కొత్తగా వైరింగ్ చేయించడంతో పాటు ఆధునిక కరెంట్ బోర్డులను ఏర్పాటు చేయించారు. బడి తెరిచే నాటికే ప్రాంగణమంతా పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో, ముందే కూలీలను పెట్టి పాఠశాల గదులను, పరిసరాలను శుభ్రం చేయించి ఆదర్శంగా నిలిచారు.పాఠశాల ఆవరణలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా విద్యార్థుల భద్రత కోసం సర్పంచ్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగానే పాఠశాల పరిసరాల్లో పెద్ద వీధి దీపాలను, నిఘా కోసం సిసి (CC) కెమెరాలను ఏర్పాటు చేయించారు. "పిల్లలకు మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలి. ప్రభుత్వం ఇచ్చే బడ్జెట్ ఏమాత్రం సరిపోకపోయినా, అదనపు ఖర్చులను భరించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను."భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి ఎలాంటి అవసరాలు వచ్చినా, నిధుల కొరత రానివ్వనని, తనను ఎప్పుడైనా సంప్రదించవచ్చని ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు నమ్మకాన్నిచ్చారు.పాఠశాల అభివృద్ధి కోసం సర్పంచ్ రామ్ సింగ్ నాయక్ గారు అందిస్తున్న అసాధారణ సహకారానికి, వారి దాతృత్వానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. చంద్ర మోహన్ గారు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లి దండ్రులు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలపై ఇలాంటి ప్రజాప్రతినిధుల ఆదరణ ఉంటే విద్యావ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రభాత గమనం
వరంగల్, మంగళవారం, 16-06-2026

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- అర్జీలను నిరంతరం పర్యవేక్షిస్తూ, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశం



**మహబూబాబాద్, జూన్ 15 (ప్రభాత గమనం):**

జిల్లా నలుమూలల నుండి వచ్చే ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించడానికే 'ప్రజావాణి' కార్యక్రమానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్, ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పురుషోత్తం లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని అధికారులు అత్యంత బాధ్యతగా స్వీకరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, చట్ట నిబంధనల ప్రకారం అర్హులకు తక్షణమే న్యాయం చేయాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. పాఠశాల ఆవరణలను శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటిస్తూ నాణ్యమైన విద్యాబోధన అందించాలని, మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎక్కడా రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు ప్రధానంగా భూ సమస్యలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, ఆసరా పింఛన్లు, ఉపాధి హామీ పథకం మరియు స్థానిక మున్సిపాలిటీ, పంచాయతీ సమస్యలపై కలెక్టర్కు వినతి పత్రాలు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం (215) దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఆయా శాఖల వారీగా కంప్యూటరైజ్ చేసి, సంబంధిత అధికారులకు ఆన్లైన్ ద్వారా బదిలీ చేశారు. నిర్ణీత కాలవ్యవధిలోగా వీటికి పరిష్కారం చూపి, నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండాలని, దరఖాస్తుదారుడు సంతృప్తి చెందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ స్నేహ శబరీష్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, జడ్పీ సీఈవో (హౌసింగ్ పీడీ) అదనపు కలెక్టర్ ఇంచార్జ్ స్థానిక సంస్థల పురుషోత్తం, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# సూర్యాపేట జిల్లాలో పోలీసుల కార్డన్ సెర్చ్..

- పత్రాలు సరిగ్గా లేని 26 బైక్ లు, ఆరు కార్లు స్వాధీనం
- ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీల వ్యక్తిగత వివరాలు ప్రస్తుత స్థితిగతులు పరిశీలన
- కాలనీలోని ప్రతి నివాసం, ప్రతి వ్యక్తిని తనిఖీ చేసిన పోలీసులు
- అప్రమత్తత, అవగాహనతోనే నేరాల నియంత్రణ
- సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్నకుమార్

**సూర్యాపేట, జూన్ 15 (ప్రభాత గమనం):**

సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు, నేర నియంత్రణ మరియు ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించే లక్ష్యంతో సోమవారం తెల్లవారుజామున సూర్యాపేట రూరల్ పరిధిలోని అంజనాపురి మరియు మానస నగర్ కాలనీల్లో పోలీసులు మెరుపు దాడి (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించారు.ఈ తనిఖీల్లో సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్ఐ బాలు నాయక్ మరియు సుమారు 80 మందికి పైగా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాలనీలోని ప్రతి నివాసాన్ని, ప్రతి వ్యక్తిని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాలైన రాజస్థాన్ మరియు మహారాష్ట్రల నుండి వచ్చి ఇక్కడ నివాసం ఉంటున్న కూలీల వివరాలను సేకరించారు.ఈ కార్యక్రమంలో సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నామ భద్రయ్య పాడె మోసిన మాజీ ఎంపీ నామ

- కుటుంబ సభ్యులకు పరామర్శ

**మహబూబాబాద్ జూన్ 15(ప్రభాత గమనం):**

మహబూబాబాద్ జిల్లా బలపాల గ్రామానికి చెందిన ప్రముఖ రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగి, నాయకుడు నామ భద్రయ్య (95) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మరణం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జాతీయ నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సోమవారం ఉదయం బలపాల గ్రామంలోని భద్రయ్య స్వగృహానికి చేరుకుని వారి పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**- అంతిమయాత్రలో పాల్గొని పాడె మోసిన నామ నాగేశ్వరరావు**

అంతిమయాత్రలో మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు స్వయంగా పాల్గొని, స్మశానవాటిక వరకు పాడె మోస్తూ తన అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా భద్రయ్యతో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. భద్రయ్య కుమారుడు నామ రమేష్, కుమార్తె విజయలతో పాటు కుటుంబ సభ్యులను నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, అన్ని పార్టీల ప్రముఖ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని భద్రయ్యకు తుది వీడ్కోలు పలికారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరికుంట్ల నాగన్న

**మహబూబాబాద్, జూన్ 15(ప్రభాత గమనం):**

సోమవారం గాంధీ పార్క్ లొ మున్సిపల్ కార్మికుల సమావేశం పుచ్చకాయల ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి కుంట నాగన్న మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని సమాన పనికి సమానత వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని తెలిపారు.ప్రమాదంలో కార్మికుడు చనిపోతే భీమా రూ.25 లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు.అలాగే మట్టి ఖర్చుల కింద 50వేల రూపాయలు ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి పని కల్పించాలన్నారు.అర్హులైన వారికీ ప్రమోషన్స్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం జరిగిందని కానీ రెండున్నర సంవత్సరాలైనా ఇప్పటివరకు మున్సిపాలిటీ కార్మికుల గురించి అసెంబ్లీలో చర్చించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా తక్షణమే వీరి సమస్యలపై చర్చించాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్నందు కృష్ణ,చిరంజీవి పుష్ప రాజ్, ఆవుల వీరన్న, ఇమ్మడి పద్మ, మంజుల,రాము, అర్చన, వెంకన్న, ముత్తమ్మ, రాములు, ఆదాము, వీరన్న,రాము,రజిని, సైదులు, అంజయ్య, జానీ,జగన్ , మనోహర్,కాగితం శీను, అచ్చమ్మ, లక్ష్మి,చరణ్ తదితరులు పాల్గొన్నారు.





# తాగునీటి బావిలో పూడిక తీత పనులు ప్రారంభం

**కేసముద్రం, జూన్ 15(ప్రభాత గమనం):**

కేసముద్రం మండలం క్యాంపుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని వనాలకుంట తండాలోని నల్లాల బావిలో పూడిక తీత పనులను స్థానిక సర్పంచ్ ధరావత్ కైక ఎంపీడీవో క్రాంతి తో కలిసి సోమవారం నాడు ప్రారంభించారు.గతంలో ఈ బావి క్రుంగి ఉండేదని దానిని మరమ్మత్తు చేయడానికి పూడిక తీత పనులను మొదలు పెట్టామని తెలిపారు. దీంట్లో నీళ్లు నిత్యం ఊరుతూ ప్రజలకు ఎండాకాలం, వానాకాలం అనే తేడా లేకుండా నీళ్లు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసి రవి నాయక్, మండల పంచాయతీ అధికారి, రమేష్ పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ రెడ్ క్రాస్ సభ్యత్వం తీసుకోవాలి

- అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్

**మహబూబాబాద్ జూన్ 15(ప్రభాత గమనం):**

మానవతా సేవే లక్ష్యంగా పనిచేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్, పిలుపునిచ్చారు.సోమవారం జిల్లా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచనల మేరకు జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్వో) రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్ చేతుల మీదుగా జిల్లా జర్నలిస్టులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన సేవలను అందించే అవకాశముంటుందని తెలిపారు. సేవా భావం కలిగిన ప్రజలు, యువత, ఉద్యోగులు, జర్నలిస్టులు రెడ్ క్రాస్ సభ్యత్వాన్ని పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొని సభ్యత్వ నమోదు చేసుకున్నారు.

# 'ప్రైవేట్' అరాచకానికి అడ్డుకట్ట ఎప్పుడు..?

- ఫీజుల దోపిడీతో తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్న విద్యా మాఫియా
- నిబంధనలు గాలికొదిలి హోర్డింగుల హంగామా
- అక్రమ హోర్డింగులు, టౌన్ ప్లాన్ అధికారులపై ప్రజావాణిలో టీఆర్పీ ఫిర్యాదు
- ఫలితాల పేరుతో ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న విద్యాసంస్థల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- ఫీజుల దోపిడీని అరికట్టలేని ప్రభుత్వం విద్యార్థులకు ఏం న్యాయం చేస్తుందని ప్రశ్న
- చర్యలు తీసుకోకుంటే తల్లిదండ్రులతో కలిసి ఉద్యమిస్తాం
- టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా



**కరీంనగర్ జూన్ 15(ప్రభాత గమనం):**

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నప్పటికీ ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం అత్యంత బాధాకరమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ కరీంనగర్ జిల్లా నాయకులతో కలిసి రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను బేఖాతరు చేస్తూ అనేక ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ మరియు ఇంజనీరింగ్ కళాశాలలు విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫార్ములు మరియు ఇతర పేర్లతో వేలాది రూపాయలు అదనంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. మరోవైపు విద్యార్థుల పరీక్షా ఫలితాలను నిబంధనలకు విరుద్ధంగా భారీ హోర్డింగులు, ఫ్లెక్సీల రూపంలో ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించి అడ్మిషన్లు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అక్రమ హోర్డింగులపై మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ మరియు టౌన్ ప్లాన్ అధికారులు చర్యలో తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది అన్నారు. విద్యాశాఖ అధికారులు ఈ అక్రమాలన్నీ కళ్ల ముందే జరుగుతున్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని అఖిల్ పాషా మండిపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్య వైఖరి కారణంగానే ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై వెంటనే సమగ్ర విచారణ జరిపి, నిబంధనలను ఉల్లంఘించిన యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అక్రమ హోర్డింగులు ఏర్పాటు చేసి తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్న విద్యాసంస్థల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు మరియు తల్లిదండ్రుల ఆర్థిక భారం దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ఫీజుల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని, లేదంటే తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అఖిల్ పాషా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింక లావణ్య, జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, మండలాల అధ్యక్షులు ఓర్సు రాజు, అమ్మిగళ్ల కుమార్, ఓర్సు విమల తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374